నేటితో నీ ప్రాణాలు కృష్ణపాలు చేస్తాను. నీ శరీరాన్ని నాగుల కౌగిట్లో పరవశించే కృష్ణమ్మ పెంచుకున్న మొసళ్ళు పీక్కు తింటాయి" అంటూ త్రిశూలాన్ని అతని కంఠానికి ఆనించింది శ్వేతకి.

క్షుద్రకాళింగుడు విభ్రాంతుడే కాదు భయభ్రాంతుడయినాడు. అతని పురుషాధిక్యత మాత్రం అహంకరించింది.

"ఓసి ద్రావిడ వనితా! రాత్రి యుద్ధం చేస్తావా? అందుకే నిన్ను నిశాచరి అన్నారు. రాక్షసి అన్నారు. ద్రావిడులను దస్యులన్నారు. పగటి యుద్ధం చేయజాలని పంద అయి రాత్రి యుద్ధం ప్రారంభించావా? ఔత్తరాహులయిన ఆర్యుల యుగయుగాల సంప్రదాయంగా పురోగమించిన యుద్ధనీతి మీ రాత్రించరుల కుటిలనీతిముందు తల దింపుతుందనుకున్నావా?" అంటూ ఇంకా ఏవో పురుషాధిక్యత. ఆర్యపక్షపాతమూ రంగరించిన ప్రగల్భాలు పలుకసాగాడు క్షుద్ర కాళింగుడు.

శ్వేతకి ఇంకా అతనికి అటువంటి అవకాశం ఇవ్వలేదు.

ఆమె త్రిశూలపాణిని. త్రిశూలం అతని రక్తాన్ని రుచి చూసింది. అతడు ఆర్తుడై ఆర్తనాదం చేశాడు. అసువులు అసాంతమయినాయి.

ఔత్తరాహ సేనావాహిని అతలా కుతలమయింది.

కాని వారు విసిరిన ఆయుధాలమధ్య ఒంటరిగా చిక్కిన శ్వేతకి శరీరం తూట్లు పడిపోయింది. నాగ రక్తంతో తడిసిన నాగభూమి దీనురాలయి శోకించింది.

నాగుల కౌగిట్లో కృష్ణమ్మ సుస్థిర అయింది. అందుకు కారకురాలయిన శ్వేతకి మాత్రం అసువులు బాసింది.

* * *

అద్భుతమయిన ఆ దృశ్యాలు అంతటితో అసాంతమయినాయి. తిరిగి జ్యోతి మనోఫలకంమీద శ్వేతకి ఆత్మరూపం ప్రత్యక్షమయింది.

"సోదరీ! చూచినావుకదా ఔత్తరాహుల ఆగడం. నేను దాచిన నిధులు ఈ కృష్ణాతీర వాసులకే దక్కాలన్న నా ఈ వ్రతం ఇంకా నెరవేరలేదు.

అది నీవల్ల రేపటి ప్రొద్దు జరుగనున్నది. నిధులు బయటపడి కృష్ణాతీర వాసులయిన దాక్షిణాత్యులకు అవి దక్కాలి. అప్పుడే నా ఆత్మకు విముక్తి" అన్నది శ్వేతకి ఆత్మరూపం.

నిద్రాముద్రలోనే గాఢతరంగా దీర్ఘంగా నిట్టూర్చింది జ్యోతి ॥

[సశేషం]

# అదంతే

## విశ్వనాథపావనిశాస్త్రి



"ఓసేవ్ అప్పలమ్మా!" అరిచింది సుందరమ్మగారు. "ఏటమ్మా!" గేటుతీస్తూ తిరిగి అరిచింది అప్పలమ్మ.

"అప్పుడే పోతున్నావుటే నీ దుంపతెగ. ఈ ఒక్క గిన్నె కూడా కడిగేసిపోవే అమ్మా!" బతిమాలుతున్నట్లుగా కసురుతోందో, కసురుతున్నట్లుగా బతిమాలుతోందో తెలియడంలేదు.

"ఇందాకే సెబోయినారటమ్మా! గేటు తీసినాకిప్పుడా సెప్పడం. నావల్ల కాదు మరి-" వినయమో, విసుగో తెలియడంలేదు.

"ఈ ఒక్క గిన్నెనే. తోమి వెళ్ళవే బాబూ" కొంచెం తగ్గింది సుందరమ్మగారు.

అంతే! ఎక్కేసింది అప్పలమ్మ. "రేపు పొద్దున్న తోముతా నట్టేపెట్టంగమ్మా-"

"ఎంతసేపే! మాట్లాడినంత సేపుపట్టదు. ఇదొక్కటే తోమిపో ముందు" సుందరమ్మగారి దబాయింపు.

"ఆతలింకా రెండిళ్ళున్నాయమ్మా! ఇప్పటికే మాసెడ్డ ఆలీశమైపోనాది. రేపు తోంతానని సెప్పానుగంద" – అప్పలమ్మ బుకాయింపు.

గేటుబయట కాలుపెట్టింది అప్పలమ్మ. "నీకెంత పెట్టినా విశ్వాసం లేదు. నీ జన్మే అంత. వెధవ జన్మ. ముదనష్టపు జన్మ." విసుక్కుంది సుందరమ్మగారు వెళ్ళిపోతున్న అప్పలమ్మని చూసి. "ఎంత జేసినా యింకా సెప్తానే వుంటారు. మీకేం పోనాద" గొణుక్కుంది అప్పలమ్మ విసుక్కుంటున్న సుందరమ్మగారిని విని.

"మళ్ళీ రేపు నా యింట్లో కాలు పెట్టు చెప్తా" సుందరమ్మగారి స్వగతం.

"ఈ యింటో పని సెయ్యడం నా వల్ల కాదు బాబు-" అప్పలమ్మ ఆకాశ భాషితం.

"రేపటి నుంచి దీనిచేత పనిచేయించుకుంటే పాము కరిచి చచ్చినంత ఒట్టే"– సుందరమ్మగారి ప్రతిజ్ఞ.

"రేపట్నుంచిగాని ఈ యింటో పన్జేస్తే పుస్తె పుటుక్కుమన్నంతొట్టే-" అప్పలమ్మ ఆన.

* * *

తెల్లారింది. కోడికూతలు వినబళ్ళేదుగాని పాలవ్యాను వచ్చేసింది. పాల పొట్లాల కోసం పరిగెత్తుతున్న వాళ్ళతోను, తెచ్చుకుంటున్న వాళ్ళతోను, కళ్ళాపి, ముగ్గులు లేకుండానే వీధులు కళకళలాడిపోతున్నాయి.

"అమ్మా! అంట్లు –" అప్పలమ్మ కేక.

"ముందర వాకిలి ఊడు! వేస్తా" సుందరమ్మగారి కేక.

"కొంచెం కాఫీ పొయ్యండమ్మా! తల నొస్తున్నాది." అప్పలమ్మ గారాలు కుడుస్తోందో, గునుస్తోందో!

"ముందరా వాకిలూడ్చి అంట్లు ఏడుస్తూ వుండు, యిస్తా" సుందరమ్మగారి గొంతులో ఏదో అవ్యక్తాదరణ.

* * *

ఎన్నిసార్లు పీకినా పెరట్లో చంద్రకాంత మొక్కలు దుబ్బుల్లా పెరిగిపోతూనే వున్నాయి. పోనీ దుంప పెల్లగించేద్దామంటే పూలుపూసే చెట్లు– పీకెయ్యడానికి సుందరమ్మగారికి మనసొప్పడంలేదు. మరెల్లా– అదంతే! సుందరమ్మగారికి పూలు కావాలి. ఆ మొక్కలికి క్షేత్రం కావాలి.